క్లుప్తంగా...

'స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం వద్దు'

అత్తాపూర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచడానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు లెర్నింగ్, ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ ఎల్ఈపీల పర్యవేక్షణ, తనిఖీల్లో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ సంఘం పక్షాన వ్యతిరేకిస్తున్నట్లు జిల్లా తెలంగాణ పీఆర్టీయూ అధ్యక్షులు కేశవులు, ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయాల వల్ల ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందన్నారు.

నేడు ఉచిత హోమియో వైద్యశిబిరం

రాజేంద్రనగర్: డివిజన్‌లోని బుద్వేల్‌లో అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు కె.బాల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ ముచ్చింతల్‌లోని జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం 10 గంటల నుంచి 1 గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. కీళ్ల నొప్పులు, మధుమేహం, ఉబ్బసం, గొంతు, ఎముకలు, కిడ్నీ, స్త్రీ సంబంధిత, అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు ఉచిత మందులను పంపిణీ చేస్తామన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ హనుమాన్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ బీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణముదిరాజ్ హాజరై విద్యార్థులకు యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు.

అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవార్లకు ఈసారి హుండీ ద్వారా రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. ఆషాఢ బోనాల సందర్భంగా ఇప్పటి వరకు మొత్తం రూ.2,38,695లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. మంగళవారం ఈఓ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపులో ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షులు సాయిబాబాచారి తదితరులున్నారు.


మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ

యాకుత్‌పురా: హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం బోనాల వజ్రోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయ కమిటీ తరపున లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పోతరాజుల నృత్యాలతో ఆలయం నుంచి బయలుదేరిన సభ్యుల బృందం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సింహవాహిని ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్‌యాదవ్ కమిటీ సభ్యులతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించిన వారిని సన్మానించారు. అక్కన మాదన్న ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్, సభ్యులు రాజారత్నం, డాక్టర్ భరత్‌ప్రకాష్, సతీష్, క్రాంతికుమార్, జగన్మోహన్‌కపూర్, శ్రీనివాస్, గోపాల్, సాయికిరణ్, ముఖేష్ యాదవ్ పాల్గొన్నారు.

యువ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

రాయదుర్గం: యువ ఓటర్లు బీజేపీవైపు మొగ్గు చూపుతున్నారని బీజేవైఎం రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైతాపురం జితేందర్ స్పష్టం చేశారు. బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నక్కా సామ్రాట్‌గౌడ్ ఆధ్వర్యంలో యువ ఓటరు నమోదు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు బీజేవైఎం కృషి చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా ఆహారధాన్యాలు అందించారన్నారు.

వ్యక్తి అదృశ్యం



శంషాబాద్ రూరల్: అత్తగారింటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కవ్వగూడకు చెందిన కె.నరేందర్(45) ఈ నెల 18న రాళ్లగూడలోని అత్తగారింటికి వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరాడు. అక్కడకు వెళ్లకుండా, తిరిగి ఇంటికి రాలేదు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. పలుచోట్ల వెతికిన కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్లార్.. స్పెషల్ డ్రైవ్

- పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు చర్యలు: జడ్పీ శంకరయ్య



సెల్లార్ తవ్వకం

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లోని సెల్లార్ తవ్వకాలపై జీహెచ్ఎంసీ అధికారులు దృష్టి సారించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలంలో సెల్లార్ తవ్వకాలు చేపట్టవద్దని ఆదేశాలు సైతం జారీ చేశారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, ఆర్సీపురం పటాన్‌చెరు సర్కిళ్ల పరిధిలోని సెల్లార్ తవ్వకాలను టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలిస్తున్నారు. జీహెచ్ఎంసీ గైడ్‌లైన్స్ పాటించాలని సెల్లార్ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. వెస్ట్ జోనల్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో 39 సెల్లార్ల తవ్వకాలు చేపడుతున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. యూసుఫ్‌గూడలో రెండు, శేరిలింగంపల్లిలో 19, చందానగర్‌లో 14, ఆర్సీపురం పటాన్‌చెరులో 4 సెల్లార్ల తవ్వకాలు చేస్తున్నారు. యూసుఫ్‌గూడలో ఓ సెల్లార్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే 20 సెల్లార్లకు నోటీసులు జారీ చేశారు. మరో 19 సెల్లార్లకు నోటీసులు ఇవ్వాల్సి ఉందని టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొంటున్నారు.



సెల్లార్ తవ్వకాలను పరిశీలిస్తున్న శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు

వర్షాకాలంలో ప్రమాదాలు

వర్షాకాలం సెల్లార్ తవ్వకాలు చేపడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. వర్షాలకు సెల్లార్ దారులు పూడుకుపోవడం, నీరు నిలవడంతో అక్కడ ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువ. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ అధికారులు వర్షాకాలం సెల్లార్ల తవ్వకాలపై నిషేధం విధిస్తున్నారు.

జీహెచ్ఎంసీ గైడ్ లైన్స్ ఇవే...

- వర్షాకాలం కంటే ముందే ప్రారంభమైన సెల్లార్ తవ్వకాలు అనుమతి ప్రకారం ఖచ్చితమైన సెట్ బ్యాక్స్ పాటించాలి.
- సాయిల్ స్ట్రెన్త్, రిటైనింగ్ వాల్, బారికేడ్ల ఏర్పాటు తప్పని సరిగా ఉండాలి.
- పక్క నిర్మాణాలకు ముప్పు లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలి.
- సెల్లార్ తవ్వకాలు జరిపే చోట లేబర్ క్యాంపులు ఉంచరాదు. అలాంటివి ఉంటే నోటీసులు ఇచ్చి వెంటనే పక్కకు తరలించాలి.
- ప్రమాదకరంగా ఉన్న సెల్లార్లలో పనులు నిలిపివేయాలి.
- జీహెచ్ఎంసీ గైడ్‌లైన్స్ పాటించని సెల్లార్ తవ్వకాలను నిలిపివేయడంతో బాటు అనుమతి రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.
- కొత్తగా చేపట్టే సెల్లార్ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదు.

జీహెచ్ఎంసీ గైడ్‌లైన్స్ పాటించాలి



వర్షాకాలంలో సెల్లార్ తవ్వకాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రమాదాలను నివారించేందుకు వెస్ట్ జోనల్ పరిధిలోని సెల్లార్లను గుర్తించాం. ఇప్పటికే పనులు ప్రారంభించిన వారు తీసుకోవాల్సిన భద్రతా చర్యలను తెలియజేశాం. సెల్లార్ తవ్వకాలు చేపట్టే యజమానులు, కాంట్రాక్టర్లు ఖచ్చితంగా జీహెచ్ఎంసీ గైడ్‌లైన్స్ పాటించాలి. గైడ్ లైన్స్ పాటించని, ప్రమాదకరంగా ఉన్న సెల్లార్ల పనులను నిలిపివేస్తాం.

– జె.శంకరయ్య, కమిషనర్, వెస్ట్ జోన్

సీబీఐటీలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు



విద్యుత్ భద్రతా మాన్యువల్‌ను విడుదల చేసిన అతిథులు, అధ్యాపకులు

మణికొండ: విద్యుత్ వినియోగంలో భద్రతా ప్రమాణాలు పాటించటం ద్వారా ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా రక్షించుకోవచ్చని జిల్లా డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టి. సూర్యచంద్రశేఖర్ అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర విద్యుత్ అథారిటీ స్టాండింగ్ కమిటీ సూచనల మేరకు ప్రతి సంవత్సరం జూన్ 26వ తేదీ నుంచి జూలై 2వ తేదీ వరకు వారోత్సవాలను పాటిస్తున్నామన్నారు. తమను తాము రక్షించుకోవటానికి వీలుగా విద్యుత్ పరికరాల నిర్వహణకు సంబంధించి చేయవలసినవి, చేయకూడని వాటిని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ సురేష్‌కుమార్, ప్రొఫెసర్ జి.సురేష్‌బాబు, పీఆర్ఓ డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉపకరణాల భద్రతా మాన్యువల్‌ను విడుదల చేశారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



ఓంనగర్ కాలనీలో మంచినీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

బండ్లగూడ: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని శాశ్వతంగా పరిష్కస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్ వెల్లడించారు. 18వ డివిజన్ ఓంనగర్ కాలనీలో మంచినీటి పైపులైన్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశల వారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు.ప్రస్తుతం మంచినీటి పైపులైన్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలని సూచించారు. సంపత్‌ముదిరాజ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం ఆయన గార్బేజీ కవర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండగ సందర్భంగా వెలువడే వ్యర్థాలను ప్రజలు రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దన్నారు. ఇంటి వద్దకు వచ్చే ఆటో రిక్షా కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, మేనేజర్ వేణుగోపాల్, జవాన్లు పాల్గొన్నారు.



కవర్లు పంపిణీ చేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

గోల్కొండ కోటలో ప్రత్యేక పూజలు



గోల్కొండ: గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి అమ్మవార్లకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢమాసంలో అమ్మవార్లకు గురు, ఆదివారాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. మంగళవారం జరిగిన పూజల్లో ఆలయ ఈఓ శ్రీనివాసరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



హసన్‌నగర్‌లో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని మజ్లీస్ పార్టీ నాయకుడు మహ్మద్ జంగీర్ అన్నారు. మంగళవారం మహమూద్‌నగర్, హసన్‌నగర్ ప్రాంతాల్లో ఎంటమాలజీ సిబ్బందితో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్, కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్‌ల సహకారంతో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహ్మద్ ఇక్బాల్‌ఖాన్, మహ్మద్ ఇస్మాయిల్, మజ్జు పాల్గొన్నారు.

పండగలు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయి

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: పండగలు మత సామరస్యాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బక్రీద్, బోనాల పండగ ఏర్పాట్లపై మంగళవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బక్రీద్ సందర్భంగా జీవాల విక్రయాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వచ్చే గురువారం గోల్కొండ కోట అమ్మవారికి జరిగే 3 బోనం పూజకు భారీగా భక్తులు తరలివస్తారన్నారు. అనంతరం ఆయన అమ్మవారి ఘటాల ఊరేగింపు ఏర్పాట్లను గోల్కొండ కోట, కోట చౌరస్తా, బడాబజార్, చోటా బజార్, తదితర ప్రాంతాల్లో తిరిగి పోలీసులకు అవసరమైన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే, సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ అశ్వాక్, ఆసిఫ్‌నగర్ ఏసీపీ శివమారుతి, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, కుతుబ్‌షాహీ ఈద్గా కమిటీ అధ్యక్షుడు గులాంమొహియుద్దీన్‌ఖాన్ పాషాభాయ్, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

కళలు ఒత్తిడిని తగ్గిస్తాయి

విజయనగర్‌కాలనీ: దైనందిన జీవితంలో ఒత్తిళ్లను తగ్గించి మనస్సును ఆహ్లాదపరిచేందుకు కళలు తోడ్పడుతాయని జేఎన్ఏఎఫ్ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత దరియానిరావు అన్నారు. మాసబ్ ట్యాంక్‌లోని జవహర్‌లాల్‌నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో విస్టాక్ 23 పేరిట అప్లయిడ్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాఖండాలను ఆమె మంగళవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ కొడాలి సుందర్‌కుమార్, సీఎఫ్ఏ ప్రిన్సిపాల్ గంగాధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫైనార్ట్స్ విద్యార్థులకు దేశ విదేశాలలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విరివిగా ఉన్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ జూలై 1వ తేదీ వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తిలకించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

బండ్లగూడ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం శాంతినగర్, కర్విల్ హోమ్, డ్రీమ్ హోమ్స్, గంధంగూడ ఓల్డ్ విలేజ్‌లో ఇంటింటికి తిరుగుతూ పార్టీ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500లకు వంట గ్యాస్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏ-బ్లాక్ అధ్యక్షులు డి.నవీన్, సంజీవ్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి (మిట్టు), ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, అద్నాన్ నదీఖ, విష్ణు, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, వేణుగోపాల్, ప్రవీణ్, రమేష్, బి.కుమార్, ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి రాజేష్, బి.శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలు పంపిణీ

శంషాబాద్ రూరల్: మండలంలోని జూకల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు మంగళవారం ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. దాత ఏనుగు దేవేందర్‌రెడ్డి గత పదేళ్లుగా విద్యార్థులకు ప్రతి ఏటా నోట్ పుస్తకాలు, షూ పంపిణీ చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు కిషోర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు వేణురెడ్డి, అనిత, రాజునాయక్, ఎస్ఎంసీ చైర్మన్ దేవానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్ఎం ఎన్.సాయిప్రసాద్‌రావు

అత్తాపూర్: విద్యార్థులు నిత్య పఠనంతోనే విజ్ఞానవంతులవుతారని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సాయిప్రసాద్‌రావు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిటరసీ–2023లో పాఠశాలకు చెందిన కె.నేహ, పి.దివ్యశ్రేష్ఠలకు ప్రశంసపత్రాలు, బహుమతులు అందాయి. మంగళవారం హెచ్ఎం విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహావీర్ కాలేజీలో టెక్నోమిస్ట్–2023



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

అత్తాపూర్: మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో టెక్నోమిస్ట్–2023 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 255 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కళాశాలలో ప్రతి సంవత్సరం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్, మోడల్ ఎగ్జిబిషన్, హాక్ ఫీస్ట్ డిబెట్, క్విజ్, షార్ట్ ఫిల్మ్ విభాగంలో విద్యార్థులు ప్రతిభ చూపారు. కార్యక్రమంలో కన్వీనర్ బి.ప్రమోద, కోకన్వీనర్ స్వప్న, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, అగ్నిహోత్రి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధక విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

రాజేంద్రనగర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని ఆందోళన బాట పట్టారు. మంగళవారం తరగతులు బహిష్కరించి రోడ్డుపై బైఠాయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ యూనివర్సిటీలో రీసెర్చ్ కోసం కల్పిస్తున్న సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రీసెర్చ్ కోసం ఒక విద్యార్థికి లక్ష రూపాయల గ్రాంట్ మాత్రమే వస్తుందని దానివల్ల తాము పూర్తిస్థాయిలో పరిశోధనలు చేయలేకపోతున్నట్లు వివరించారు. సిక్స్ రేటింగ్ ఉన్న జర్నల్స్‌లో పరిశోధనలు ప్రచురితం కావాలంటే అందుకు తగ్గట్టుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుందన్నారు. గతంలో మాదిరిగానే ఫైవ్ రేటింగ్ ఉన్న జర్నల్స్‌లో ప్రచురితమైన పరిశోధనలు పరిగణనలోకి తీసుకుని పట్టాలను అందజేయాలని కోరారు. అలాగే రీసెర్చ్ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ను తక్షణమే రూ.11 వేలకు పెంచాలని, యూనివర్సిటీ అధికారులు తమ డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు.

బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి



మేరాబూత్ సబ్‌సే మజ్‌బూత్‌ను వీక్షిస్తున్న నాయకులు



అత్తాపూర్‌లో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని లోక్‌సభ సభ్యురాలు భారతి బెస్ అన్నారు. మంగళవారం కాటేదాన్ పార్టీ కార్యాలయంలో డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లోక్‌సభ సభ్యురాలు భారతి బెస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు అడికే జనార్దన్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మల్లారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, జోగి రవి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్‌ముదిరాజ్, టి.చిన్న, శ్రీకాంత్‌రెడ్డి, పాండుయాదవ్, వి.లక్ష్మి, శరణమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ ప్రసంగాన్ని రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గుంజి బాబురావు ఇంట్లో వీక్షించారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ,జిల్లా నాయకురాలు గౌరీదేవి, డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తొండుపల్లి మల్లేష్, వేణు, సీనియర్ నాయకులు జంగయ్యయాదవ్, రాజు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో..

అత్తాపూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్‌ను మంగళవారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ నివాసంలో 22, 229, 230 బూత్‌ల సభ్యులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో సాబాద స్వప్న, మూల శ్రీనివాస్‌గౌడ కాకుఠారం కృష్ణ, మ్యాడం రాము, సతీష్, శ్రీరామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌గూడలో...

లాలా లజపత్‌రాయ్ శక్తి కేంద్రంలో జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రాచూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, రామమూర్తి, అంకుర్ బన్స్, రణధీర్‌సింగ్, యాదయ్య, సుందర్, శశి బన్సల్ తదితరులు పాల్గొన్నారు.